TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU






ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in

వరంగల్ సంపుటి : 2 సంచిక : 26 ఆదివారం 6 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5 www.telanganamuchatlu.in

## మూసీ నిర్వాసితులపై

## సీఎం రేవంత్ కీలక ప్రకటన



హైదరాబాద్ (అక్టోబర్ 5) : మూసి నిర్వాసితులను ఆదుకునే అంశంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. నిర్వాసితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం వారందరినీ ఆదుకుంటుందన్నారు. ఎవరినీ అనాదలను చేయబోమన్నారు. ప్రత్యామ్నాయం చూపిస్తామని హామీ ఇచ్చారు సీఎం. అంతేకాదు.. ఎవరైనా వచ్చి రెచ్చగొడితే వారి మాటలను నమ్మొదని, వారి ఫామ్ హౌజ్‌లను కాపాడుకోవడానికే డ్రామాలాడుతున్నారని సీఎం విమర్శించారు. శనివారం నాడు కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. మూసీ నిర్వాసితులకు భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు. మూసీ నిర్వాసితులు అధైర్యపడొద్దని.. ప్రత్యామ్నాయం చూపిస్తామన్నారు. మూసీ బాధితులకు అండగా ఉన్నట్లు

మిగతా 2లో...

# రూ.20,000 కోట్ల

# పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను

# విడుదల చేసిన మోదీ



**భూములున్న రైతులకు మూడు వాయిదాల్లో ఏటా రూ.6,000 ఇచ్చే పీఎం-కిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించారు. శనివారం నాడు 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద ప్రధాని విడుదల చేసిన మొత్తంతో కలిసి ఇంతవరకూ రూ.3.45 లక్షల కోట్లకు పైగా పంపిణీ జరిగింది.**




న్యూఢిల్లీ (అక్టోబర్ 5) : అన్నదాతలకు వ్యవసాయ పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్ల మొత్తాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారంనాడు విడుదల చేశారు. మహారాష్ట్రలోని వాశింలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని స్వయంగా పాల్గొని ఈ నిధులను విడుదల చేశారు. మధ్యవర్తల ప్రమేయం లేకుండా దేశవ్యాప్తంగా 9.4 కోట్ల మంది రైతులకు నేరుగా వారి అకౌంట్లలోనే ఈ మొత్తం జమ అవుతుంది. పీఎం కిసాన్ నిధుల విడుదలకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానితో పాటు మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్, మంత్రి సంజయ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్ష ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘాలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లతో సహా 2.5 కోట్ల మంత్రి రైతులు హాజరయ్యారు. భూములున్న రైతులకు మూడు వాయిదాల్లో ఏటా రూ.6,000 ఇచ్చే పీఎం-కిసాన్ పథకాన్ని 2019 ఫిబ్రవరి 24న ప్రారంభించారు. శనివారంనాడు 18వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద ప్రధాని విడుదల చేసిన మొత్తంతో కలిసి

మిగతా 2 లో

## చేసిందంతా చేసి ఇప్పుడు తలవంచుకుంటే ఏం లాభం?

♦ మోదీపై రాహుల్ విసుర్లు



ముంబై (అక్టోబర్ 5) : ప్రజా స్వామ్యాన్ని, దేశంలోని వ్యవస్థలను బీజేపీ ప్రభుత్వం నీరుగారుస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆక్షేపించారు. ప్రజలను భయ పెడుతూ, రాజ్యాంగాన్ని, ఆయా సంస్థలను నాశనం చేస్తూ ఇప్పుడు

మిగతా 2లో...



## రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు

- బ్లీచింగ్ పౌడర్ కొనడానికి డబ్బుల్లేని పరిస్థితులు
- ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, (అక్టోబర్ 5) : కాంగ్రెస్.. రైతు రుణ మాఫీ ఎగ్గొట్టి, మూసీలోమురికి రాజకీయాలు చేస్తోందని

2 లో



## కాశ్మీర్ ఎన్ కౌంటర్‌లో ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్, (అక్టోబర్ 5) : జమ్మూకాశ్మీర్ కుప్వారా జిల్లాల్లో శుక్రవారం భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందినట్లు భారత సైన్యం శనివారం వెల్లడించింది. ఈ మేరకు ఆర్మీ

మిగతా 2లో...

## ఏ మొహం పెట్టుకుని దీక్ష చేస్తావ్

## హరీష్‌కు జగ్గారెడ్డి సూటి ప్రశ్న



హైదరాబాద్, (అక్టోబర్ 5) : రుణమాఫీ అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుండగా.. రుణమాఫీతో

మిగతా 2లో...

## యాదాద్రిలో వైభవంగా గిరిప్రదక్షిణం

యాదగరిగుట్ట, (అక్టోబర్ 5) : యాదాద్రి పుణ్యక్షేత్రంలో శనివారం ఉదయం భక్త జనులు 'గిరి ప్రదక్షిణ' చేపట్టారు.

యాదాద్రీశుడైన నారసింహుడి జన్మ నక్షత్రం స్వాతి సందర్భంగా శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానం ఈ గిరి ప్రదక్షిణ నిర్వహించింది. ఇందులో పాల్గొనేందుకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. తొలుత వైకుంఠ ద్వారం వద్ద పూజలు చేసి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆలయ ఈవో భాస్కరరావు, ధర్మకర్త నరసింహమూర్తి, వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన భక్త బృందాలు పాల్గొన్నాయి.

## హరీష్.. బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో ఆలోచించు



హైదరాబాద్ (అక్టోబర్ 5) : పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ పార్టీ ఎందుకు ఓడిపోయిందో మేథోమదనం చేసుకోవాలని మాజీ ఎంపీ వి. హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద రాళ్లు వేస్తున్నారు తప్పా బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో మాజీ మంత్రి హరీష్‌రావు ఆలోచించడం లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు ఏంటో తెలుసుకోవాలని చెప్పారు. గాంధీభవన్‌లో మాజీ

2 లో

## హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ విడుదల



హైదరాబాద్, (అక్టోబర్ 5) : హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా)కు అధికారికంగా హైపవర్స్ వచ్చేశాయి. రాష్ట్రప్రభుత్వం రూపొందించిన హైడ్రా ఆర్డినెన్స్‌కు గర్నవర్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేసింది. హైడ్రా

మిగతా 2లో...

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# సంపాదకీయం

## నేరస్థులు, సహాపరాధులు

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో మధ్యప్రాచ్య సంక్షోభంపై చర్చలో స్లోవేనియా ప్రధానమంత్రి పాల్గొంటూ గాజాలో యుద్ధాన్ని నిలిపివేయమని బెంజమిన్ నెతన్యాహుకు నిష్కర్షగా చెప్పారు. 'లెబనాన్ తదుపరి గాజా కాకూడదని' ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి చాలా దూరదృష్టితో హెచ్చరించారు.

గాజా: నేరస్థులు, సహాపరాధులు

గతానుగతం

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో మధ్యప్రాచ్య సంక్షోభంపై చర్చలో స్లోవేనియా ప్రధానమంత్రి పాల్గొంటూ గాజాలో యుద్ధాన్ని నిలిపివేయమని బెంజమిన్ నెతన్యాహుకు నిష్కర్షగా చెప్పారు. 'లెబనాన్ తదుపరి గాజా కాకూడదని' ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి చాలా దూర దృష్టితో హెచ్చరించారు. స్లోవేనియా, ఆస్ట్రేలియా రెండూ అమెరికాకు సన్నిహిత దేశాలే అయినప్పటికీ అవి తమ అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పాయి. ఆ ధైర్యం మన ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రిలో పూర్తిగా కొరవడింది! హమాస్ 7 అక్టోబర్ 2023న ఇజ్రాయిల్ పౌరులపై ఒక క్రూరమైన దాడికి పాల్పడింది. ఆ ఘాతుకానికి 1100 మందికి పైగా మరణించారు. వారిలో నాలుగింట మూడు వంతుల మంది పౌరులు. ఇజ్రాయిలీ రాజ్యవ్యవస్థ వెన్వెంటనే ప్రతీకార దాడులను ప్రారంభించింది. హమాస్ నియంత్రణలో ఉన్న పాలస్తీనా ప్రాంతం గాజాపై శతఘ్ని గుండ్ల వర్షాన్ని కురిపించింది. వందలాది క్షిపణులను ప్రయోగించింది. పట్టణాలు, పల్లెలు ఎన్నో నేలమట్టమై పోయాయి. ఈ ప్రతీకారాగ్నులు కొద్ది రోజులలో కాకపోయినా కొన్ని వారాలకు నిలిచిపోగలవని ఎవరైనా భావిస్తారు, ఆశిస్తారు. అయితే ఇజ్రాయిలీలు తమ అమానుష దాడులను కొనసాగించారు. అవి ఇప్పటికీ నిర్విరామంగా జరుగుతూనే ఉన్నాయి. ఏడాది కాలంగా ఎడతెగకుండా జరుగుతున్న ఆ బీభత్సకాండలో 50 వేల మందికి పైగా పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ సేనలు నిర్దాక్షిణ్యంగా హతమార్చాయి. ఈ హతులలో 90 శాతం మంది పౌరులే. ఇజ్రాయిల్ కక్షకు పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న కష్టనష్టాలు, పడుతున్న యాతనలు అనంతమైనవి, మాటల్లో అభివర్ణించలేనివి. మానవత ఒక మృగతృష్ణగా మిగిలిపోయిన విషాద సందర్భమిది. గాజా జనాభాలో పది లక్షల మందికి పైగా సర్వం కోల్పోయి కట్టుబట్టలతో నిర్వాసితులయ్యారు. గాజాలో విధ్వంసం అనంతరం ఇజ్రాయిల్ ఇప్పుడు తన దృష్టిని లెబనాన్ పైకి సారించింది. గాజాలో మాదిరిగానే లెబనాన్‌లో కూడా ఉగ్రవాదులు, అమాయక పౌరుల మధ్య తేడాను పాటించకుండా ఇజ్రాయిల్ సేనలు మారణ హోమం చేస్తున్నాయి. నిర్దిష్ట వ్యక్తులను తుదముట్టించే ప్రయత్నంలో వందలాది లెబనీస్ పౌరులను ఇజ్రాయిల్ బలిగొన్నది. ఇంకా ఎన్నో వేల మంది నిరాశ్రయులైపోయారు. ఇజ్రాయిల్ ప్రభుత్వమూ, హమాస్ రెండూ యుద్ధ నేరాలకు పాల్పడ్డాయని ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసిసి) అభిశంసించింది. ఇది పూర్తిగా న్యాయసమ్మతమైన తీర్పు. ఈ యుద్ధం చారిత్రక ఘటనల పరంపరలో భాగంగా సంభవిస్తోందని వాదించేందుకు ఎంతగా ప్రయత్నించినా గత ఏడాది అక్టోబర్ 7న హమాస్ కిరాతక దాడులు సమర్థించలేనివి. ఇజ్రాయిల్ నేరాలు అంతకంటే తీవ్రమైనవి. ఇందులో ఎలాంటి సందేహం లేదు. హమాస్‌పై ప్రతీకారం తీర్చుకునే నెపంతో ఇజ్రాయిల్ విచక్షణారహితంగా అమానుష దాడులకు పాల్పడుతోంది. గాజాలోని పాఠశాలలు, ఆసుపత్రులను పూర్తిగా నేలమట్టం చేసింది. వేలాది పాలస్తీనియన్లను హతమార్చడంతో పాటు గాజా వాసులకు ఆహారం, మంచినీరు, విద్యుత్ సరఫరాలపై కఠిన ఆంక్షలు విధించింది. ఫలితంగా అసంఖ్యాకులు ఆకలిమంటల బారిన పడ్డారు. గాజాలో ఘర్షణలపై వార్తా నివేదన ప్రధానంగా స్పర్థిస్తున్న పక్షాల (ఇజ్రాయిలీలు, హమాస్) పరంగా ఉంటోంది. అయితే ఆ ఘర్షణలకు కారకులవడంతో పాటు అవి నిరంతరాయంగా కొనసాగేలా చేస్తున్న ఇతర బృందాల, దేశాలపై ఈ కాలమ్‌లో నేను దృష్టి పెడుతున్నాను. సమస్త యుద్ధ నేరాలలో కానప్పటికీ చాలా వాటిలో నేరస్థులకు సహాపరాధులు ఉన్నారు. ఒక వైపు హమాస్‌కు, మరో వైపు ఇజ్రాయిల్‌కు తోడ్పడుతున్నది ఎవరు? హమాస్‌కు ప్రధానంగా తోడ్పడుతున్నది మత ప్రమేయ రాజ్యమైన ఇరాన్, లెబనాన్‌లోని ఉగ్ర వాద సంస్థ హెజ్‌బొల్లా. పాశ్చాత్య దేశాల మీడియా ప్రతిరోజూ ఇరాన్, హెజ్‌బొల్లాను తప్పుపడుతున్నాయి. మధ్య ప్రాచ్యంలో యుద్ధాగ్నులు అంతకంతకూ ప్రజ్వరిల్లడానికి బాధ్యత ఇరాన్, హెజ్‌బొల్లాదేనని తెగేసి చెపుతుంటాయి. మరి ఇజ్రాయిల్‌కు తోడ్పడుతున్న దేశాలను గుర్తించి, ఆక్షేపించేందుకు పాశ్చాత్య మీడియా సంకోచిస్తోంది. అవి చెప్పని వాస్తవాలను మనం చెప్పి తీరాలి. ఇజ్రాయిల్ నేరపూరిత చర్యలను సమర్థిస్తున్నదీ, ప్రోత్సహిస్తున్నదీ అమెరికాయే. ఈ అగ్రరాజ్యం ఇజ్రాయిల్‌కు ఎడతెగకుండా ఆయుధ సరఫరా చేస్తోంది. గాజాను (ఇప్పుడు లెబనాన్‌ను) అతలాకుతలం చేసేందుకు అవసరమైన సైనిక సామగ్రిని ఇజ్రాయిల్‌కు అమెరికానే సమకూరుస్తోంది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలనే కాదు దౌత్యపరమైన అండదండలు సైతం అమెరికా ఇస్తోంది. కాల్పుల విరమణ పాటించాలని, పాలస్తీనా పౌరుల కష్టనష్టాలను నివారించాలని ఐక్యరాజ్యసమితిలో వివిధ దేశాలు ప్రతిపాదించిన తీర్మానాలను అమెరికా వ్యతిరేకిస్తోంది. భద్రతా మండలిలో ఇజ్రాయిల్ వ్యతిరేక నిర్ణయాలను వీటో చేస్తోంది. ఇజ్రాయిల్ ఘాతుకాలలో తన భాగస్వామ్యాన్ని గుర్తించేందుకు అమెరికా నిరాకరిస్తోంది.

## రుణమాఫీ ఎగ్గొట్టి, మూసీలో మురికి రాజకీయాలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చి ఆ పార్టీ మోసం చేసిందన్నారు. రైతు బంధు ఎగ్గొట్టి, మూసి పేదల ఉసురు పోసుకుంటున్న దుర్మార్గుడు ఎవరు?.. మహిళలకు వంద రోజుల్లోనే నెలకు రూ.2,500 ఇస్తా అని చెప్పి తప్పించుకు తిరుగుతున్న మోసగాడు ఎవరు?.. అవ్వ, తాతలకు నెలకు రూ.4 వేలు ఇస్తా అని చెప్పి ఎగ్గొట్టిన నయవంచకుడు ఎవరు?.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తా అని మాట తప్పిన దగావీరుడు ఎవరు? .. మూసీ సుందరీకరణ పేరుతో రూ.లక్ష 50 వేల కోట్ల లూటిఫికేషన్‌కు తెరతీసిన ఘనుడు ఎవరు? అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బతుకమ్మ పండుగ వేళ గ్రామాల్లో చెరువు వద్ద లైట్లు పెట్టడానికి, పరిశుభ్రత కోసం బ్లీచింగ్ పౌడర్ కొనడానికి డబ్బుల్లేని పరిస్థితులు వచ్చాయని కేటీఆర్ అన్నారు. బతుకమ్మ అంటే గిట్టదా..పట్టదా ఈ ముఖ్యమంత్రికి? ఆడబిడ్డల వేడుకకు ఏర్పాట్లు చేయడానికి మనసురాట్లేదా? పండుగపూట కూడా పల్లెలను పరిశుభ్రంగా ఉంచలేరా? చెత్తా చెదారం మధ్య మురికి కంపులో మన అక్కా చెల్లెళ్లు బతుకమ్మ ఆడుకోవాల్నా? పంచాయతీల్లో బ్లీచింగ్ పౌడర్ కొనడానికి.. చెరువు కట్టమీద లైట్లు పెట్టడానికి పైసల్లేని పరిస్థితులు దాపురించాయి. రాష్ట్ర పండుగను ఘనంగా నిర్వహించు కునేందుకు నిధుల్లేని దౌర్భాగ్యం ఎందుకొచ్చింది..? తెలంగాణ అస్తిత్వ సంబురంపై ఎందుకింత నిర్లక్ష్యం..? ప్రకృతిని పూజించే విశిష్ట పండుగను.. స్వచ్ఛమైన పరిసరాల్లో జరుపుకునే భాగ్యం కూడా లేదా మహిళలకు? బతుకమ్మ చీరలను ఇవ్వలేదు. ఇప్పుడు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా చేసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారా..?' అని కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

## చేసిందంతా చేసి ఇప్పుడు తలవంచుకుంటే ఏం లాభం?.. మోదీపై రాహుల్ విసుర్లు

ఛత్రపతి శివాజీ ఎదుట తలవంచి నమస్కరించడం వల్ల ఎలాంటి ప్రయోజం ఉండదని అన్నారు. కొల్హాపూర్‌లో శనివారంనాడు జరిగిన ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో రాహుల్ పాల్గొన్నారు. ఇటీవల సింధుదుర్గ్ జిల్లా రాజ్‌కోట ఫోర్ట్‌లోని 35 అడుగుల శివాజీ విగ్రహం కుప్పకూలిన ఘటనను పరోక్షంగా ప్రస్తావిస్తూ రాహుల్ తాజా వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ 2023 డిసెంబర్ 4న రాజ్‌కోట ఫోర్ట్‌లోని శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అయితే, భారీ వర్షాలతో గత ఆగస్టు 6న ఆ విగ్రహం కూలిపోవడం రాజకీయ దుమారానికి దారితీసింది. ఆ ఘటన అనంతరం గత ఆగస్టులోనే మహారాష్ట్రలో పర్యటించిన సందర్భంగా శివాజీ విగ్రహం ఘటనపై ప్రధాని క్షమాపణలు చెప్పుకున్నారు. ఛత్రపతి శివాజీ అంటే ఒక పేరో, రాజో కాదని, తమకు దైవమని అన్నారు. ఈరోజు ఆయనకు తలవంచి క్షమాపణలు చెప్పుకుంటున్నానని అన్నారు.

ఛత్రపతి వంటి వీరులు లేకుంటే...

కాగా, కొల్హాపూర్‌లో శివాజీ విగ్రహావిష్కరణకు వచ్చిన రాహుల్ గాంధీ పరోక్షంగా ఇటీవల కూలిన శివాజీ విగ్రహాన్ని ప్రస్తావిస్తూ, శివాజీ సందేశం దేశప్రజలందరికీ వర్తిస్తుందన్నారు. ఛత్రపతి శివాజీ మహరాజు, షాహు మహరాజ్ వంటి వీర యోధులు లేకుంటే అసలు రాజ్యాంగమే ఉండేది కాదని అన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని, కీలక సంస్థలను బీజేపీ ప్రభుత్వం నీరు గారుస్తోందని ఆరోపించారు.

## మూసీ నిర్వాసితులపై సీఎం రేవంత్ కీలక ప్రకటన..

మాట్లాడే వారంతా పేదలకు ఏం చేద్దామో.. వారిని ఎలా ఆదుకుందామో చెప్పాలని కోరారు. ఇళ్లు ఇద్దామా.. డబ్బులు ఇద్దామా.. ప్రభుత్వ స్థలాలు ఇద్దామా.. అని విపక్ష నేతలను సీఎం ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని నీటి ప్రమాదం నుంచి కాపాడాలని.. ప్రజల మంచి కోసమే ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు సీఎం రేవంత్. మూసీ దగ్గర ఉన్న వాళ్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాళేశ్వరంలో ఒక్క కుటుంబమే లక్ష కోట్లు మింగిందంటూ కేసీఆర్ కుటుంబం టార్గెట్‌గా తీవ్ర ఆరోపణలు చేశారు సీఎం రేవంత్. మూసి బాధితులు అందరిని ఆదుకోవడానికి పట్టుమని రూ. పదివేల కోట్లు కూడా కావన్నారు. పేదల కోసం పదివేల కోట్లు ఖర్చు పెట్టడానికి ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు సచివాలయానికి రావాలని.. ప్రజలకు ఏం చేద్దామో చర్చిద్దామని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. మూసీ విషంతో బతుకుతున్న నల్లగొండను ఎలా ఆదుకోవాలో చర్చిద్దామన్నారు. ఇలాగే వదిలేసి మూసీని మూసేద్దామా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ సబర్మతి రివర్ ఫ్రంట్ కోసం 64 వేల కుటుంబాలను తరలించారని.. కేవలం 16వేల కుటుంబాలకే పరిహారం ఇచ్చారని సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

అలాంటిదే హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ చేస్తే ఈటెల రాజేందర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో రూ. 1,500 కోట్లు ఉన్నాయని.. అందులోంచి మూసీ బాధితులకు రూ. 500 కోట్లు ఇవ్వాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. ఈ డబ్బులను మూసీ నిర్వాసితులకు పంచిపెడదామన్నారు. గజ్వేల్‌లో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాలు ఉందని.. అందులోకి 500 ఎకరాలు దానం చేస్తే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని సీఎం అన్నారు. కేటీఆర్‌కు జన్వాడలో 50 ఎకరాల ఫామ్ హౌజ్ ఉందని.. అందులో 25 ఎకరాలు ఇవ్వాలన్నారు. 'ఇవన్నీ దోచుకున్నవే కదా? మీ తాతల నుంచి వచ్చినవి కాదు కదా? 2009 నుంచి మీ ఆస్తులు ఎలా పెరుగుతూ వచ్చాయి.' అని కేటీఆర్‌ను సీఎం రేవంత్ ప్రశ్నించారు. రేస్ కోర్సు బయటకు తరలిద్దామని.. అంబర్‌పేటలో ఉన్న పోలీస్ అకాడమీని బయటకు తరలిద్దామన్న సీఎం.. అందులో పేదలకు ఇళ్లు కట్టిద్దామని చెప్పారు. పేదలకు న్యాయం చేయడానికి ఒక కమిటీని వేస్తామని.. అందులో ఈటెల రాజేందర్, కేటీఆర్, హరీష్ రావు, పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా నియమిస్తామన్నారు. పేదల బాధ తనకు తెలుసునని.. ఏ పని చేసినా అడ్డుపడొద్దని రేవంత్ విజ్ఞప్తి చేశారు.

## హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ గెజిట్ విడుదల

ఆర్డినెన్స్‌కు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు. హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్డినెన్స్‌పై సంతకం చేసిన గవర్నర్ శనివారం గెజిట్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని చెరువులు, నాలాలపై అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను రంగంలోకి దింపింది. జూలై 19న జీవో 99 ద్వారా హైడ్రాను ఏర్పాటు చేయగా.. అప్పటి నుంచి హైడ్రా దూసుకెళ్లింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న అనేక అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. అయితే ఈ కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. జీహెచ్ఎంసీ చట్టం 1955లో 374 బీ సెక్షన్ చేరుస్తూ ఆర్డినెన్స్ జారీ చేశారు. ఓఆర్ఆర్ పరిధి వరకు ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, నాలాలు పరిరక్షిస్తూ సర్వాధికారాలు ఇచ్చేలా చట్టం రూపొందించారు. జిల్లా కలెక్టర్, ఎమ్మార్వో అధికారాలను హైడ్రాకు బదలాయించారు. ఈ ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలపడంతో ఫైల్‌ను రాజ్‌భవన్‌కు పంపింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఆమోదం తెలిపారు. గవర్నర్ వ్యక్తం చేసిన పలు సందేహాలకు మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఇప్పటికే వివరణ ఇచ్చారు. ప్రభుత్వ వివరణలతో సంతృప్తి చెందిన గవర్నర్ హైడ్రా ఆర్డినెన్స్ ఫైల్‌పై సంతకం చేశారు. ఆపై గెజిట్‌ను విడదల చేశారు. గెజిట్ విడుదలతో హైడ్రాకు ఎదురులేకుండాపోయింది. ఇక చట్టబద్ధత లభించడంతో హైడ్రా మరింత వేగంగా దూసుకుపోనుంది. చెరువులు, నాలాలపై ఉన్న అక్రమ నిర్మాణాల విషయంలో తగ్గేదే లే అన్నట్లు చెలరేగిపోనుంది హైడ్రా.

## ఏ మొహం పెట్టుకుని దీక్ష చేస్తావ్

రైతులను కాంగ్రెస్ మోసం చేసిందంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తోంది. ఈ అంశంపై ప్రతీరోజు ఇరుపార్టీల నేతలు ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుతూనే ఉన్నారు. తాజాగా రుణమాఫీ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పందించారు. రుణమాఫీకి సంబంధించి మాజీ మంత్రి హరీశ్‌రావుకు జగ్గారెడ్డి ఛాలెంజ్ విసిరారు. రుణమాఫీపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా అంటూ సవాల్ చేశారు. రుణమాఫీపై రైతులతో చర్చ చేద్దామని.. ఎల్లిగాడు, మల్లిగాడు కాకుండా కేసీఆర్ చర్చకు రావాలన్నారు.

రుణమాఫీ కాలేదు నిజమే..కానీ

"సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి చర్చకు నేను తీసుకువస్తాను.. కేసీఆర్‌ను ఒప్పించి తీసుకువచ్చే కెపాసిటీ హరీష్‌కు ఉందా. అక్కడ, ఇక్కడ భయమైతే సిద్దిపేటలోనే చర్చ పెట్టు. మేం పబ్లిసిటీ దగ్గర ఫెయిల్ అయ్యాం. బీఆర్ఎస్ పార్టీ పబ్లిసిటీ దగ్గర పాస్ అయింది. సాంకేతిక కారణాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని మేమే చెప్తున్నాం. హరీష్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారు. ఆర్థిక శాఖను కేసీఆర్ దివాళా తీశారు. కేసీఆర్ తొమ్మిదిన్నర సంవత్సరాల్లో 8 కిస్తీల్లో లక్ష రుణమాఫీ చేయలేకపోయారు. రుణమాఫీ అందని రైతులకు ఏ కారణాల వల్ల అందలేదో వివరాలు తెప్పించమని అధికారులకు సీఎం ఆదేశించారు" అని వెల్లడించారు.

గుండెను ఫ్రిజ్‌లో పెట్టారా?

ఏ మొహం పెట్టుకొని హరీష్ ఢిల్లీ వెళ్లి దీక్ష చేస్తారని ప్రశ్నించారు. "తెలంగాణ ప్రజలను మోసం చేసినందుకు కేసీఆర్ ఎక్కడ ఉంటే అక్కడ నేను దీక్ష చేస్తా.. నిజమైన మోసం చేసిన కేసీఆర్ ఇంటి ముందు నేనే దీక్ష చేస్తా. హరీష్ ఢిల్లీలో దీక్ష చేసిన రోజే నేను కేసీఆర్ ఇంటి దగ్గర వెళ్లి దీక్ష చేస్తాను. రాహుల్ ఎక్కడ ఉంటాడో క్లారిటీ ఉంది. కేసీఆర్ ఎక్కడ ఉంటాడో తెలియదు. హరీష్ రావుకు స్క్రిప్ట్ ఇచ్చింది ఎవరో. హరీష్ డైలాగులకు డిక్షనరీలో కూడా అర్థాలు దొరకవు. కేసీఆర్ ది రైతు గుండె అని తొమ్మిదిన్నర సంవత్సరాల తర్వాత గుర్తు వచ్చిందా? మల్లన్న సాగర్ రైతుల వీపులు పగలగొట్టినప్పుడు రైతు గుండె ఏమైంది? ఖమ్మం రైతులకు బేడీలు వేసినప్పుడు కేసీఆర్ గుండె ఫ్రిజ్‌లో పెట్టారా? సంగారెడ్డికి కేసీఆర్ వస్తే అడ్డుకుంటా అని అంటేనే హరీష్, కేసీఆర్ రాలేదు. మా దగ్గర అంతా తోపులే. కొన్ని హార్డ్ తోపులు, కొన్ని సాఫ్ట్ తోపులు ఉన్నాయి. మాకు ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో వెపన్ ఉంది. ఆటుపోట్లు తట్టుకొని నిలబడ్డవాళ్ళం మేము. మమ్మల్ని అడ్డుకోవడం కేటీఆర్ వల్ల కాదు. మహేష్ గౌడ్ మా బాస్" అంటూ జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## కాశ్మీర్ ఎన్ కౌంటర్‌లో ఇద్దరు ముష్కరుల హాతం

శనివారం ఎక్స్‌లో పోస్టు చేసింది. 'ఉగ్రవాదుల ఉనికికి సంబంధించి ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా శుక్రవారం భారత సైన్యం, జమ్మూ అండ్ కాశ్మీర్ పోలీసులు అలర్ట్ అయి సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. కుప్వారా జిల్లాలో గుగల్‌ధర్ వద్ద ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది' అని భారత సైన్యం శనివారం ఎక్స్ పోస్టులో పేర్కొంది.

## రూ.20,000 కోట్ల పీఎం కిసాన్ సమ్మాన్ నిధులను విడుదల చేసిన మోదీ

ఇంతవరకూ రూ.3.45 లక్షల కోట్లకు పైగా పంపిణీ జరిగింది. మహారాష్ట్రలో 17 ఇన్‌స్టాల్‌మెంట్స్‌లవో 1.20 కోట్ల రైతులకు రూ.32,000 కోట్లు జమ అయ్యాయి. 18వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా 91.51 లక్షల రైతులు రూ.1,900 కోట్లకు పైగా ప్రయోజనం పొందనున్నారు. పీఎం కిసాన్ ఇన్‌స్టాల్‌మెంట్ పంపిణీతో పాటు రూ.2,000 కోట్లను నమో సేత్కారి మహాసన్మాన్ నిధి యోజన 5 ఇన్‌స్టాల్‌మెంట్ కింద మహారాష్ట్రకు ప్రధామంత్రి విడుదల చేశారు.

## హరీష్.. బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో ఆలోచించు

ఎంపీ వి. హనుమంతరావు ఇవాళ (శనివారం) మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ... హరీష్‌రావుకు అంతరాత్మ ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పులు ఏంటో ఆలోచన చేయాలని హనుమంతరావు అన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకునే వారని తెలిపారు. రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్ ఎత్తి వేయాలని ఎన్సీపీ (ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ అన్నారని గుర్తుచేశారు. రిజర్వేషన్లకు మద్దతు ఇస్తామన్నారని తెలిపారు. శరత్ పవార్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలో ఓబీసీ మాజీ జాతీయ కన్వీనర్‌గా శరత్ పవార్‌ను కలుస్తానని చెప్పారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర చేశాక అన్ని రాజకీయపార్టీల్లో చలనం వస్తుందని అన్నారు. కులగణన చేశాకనే లోకల్ బాడీ ఎన్నికలు పెడితే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. ఇప్పుడే కులగణనకు సరైన సమయమని హనుమంతరావు అన్నారు.



# ఎంపీ రఘురాం రెడ్డి కన్నీటి పర్యంతం

## - బావమరిది నూకల నరేష్ రెడ్డి మృతదేహాన్ని చూసి తట్టుకోలేకపోయిన రామసహాయం

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు** : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నూకల నరేష్ రెడ్డి మృతదేహాన్ని చూసి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి కన్నీటి పర్యంతం అయ్యారు. స్వయానా బావమరిది కావడంతో ఆయన మృతిని తట్టుకోలేక పోయారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలో నరేష్ రెడ్డి మృతదేహానికి ఎంపీ నివాళు లు అర్పించారు. ఆర్ఆర్ఆర్ తో పాటు మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ బాబు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. నరేష్ రెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవున్ని ప్రార్థించారు.

# మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులు పున:ప్రారంభం

## - పరిశీలించిన తుంబూరు దయాకర్ రెడ్డి



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులు పున: ప్రారంభం అయ్యాయి. ఆ పనులను కొబ్బరికాయ కొట్టి మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం పునః ప్రారంభించారు. అనంతరం పెండింగ్ పనులను పరిశీలించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత బాధ్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కల్లెం వెంకట్ రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాధబాబు, డైరెక్టర్ పంతులు నాయక్, మద్ది మల్లా రెడ్డి, మౌలానా, మద్ది కిశోర్ రెడ్డి, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కె.వి. చారి, తమ్మినేని నవీన్, అంబటి సుబ్బారావు, నల్లపునేని కౌశిక్, గురునారాయణ, అంజయ్య, బాణోతు కిశోర్ నాయక్, ఆరెంపుల రామయ్య, బాణోతు హరి, వెంకట నారాయణ, గుడిచుట్టు వెంకన్న తదితరులున్నారు. తదనంతరం వార్తా కార్యాలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్స్ దుకాణాన్ని ప్రారంభించారు. ఖమ్మం నగరంలోని వైరా రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జివిమాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో వాణి ఐటిఐ కళాశాలలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి అన్వేష్ చింతల ఆదేశాల మేరకు, అకౌంట్స్ అండ్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ కమర్తపు భానుచందర్ ప్రోత్సాహంతో, వాణి ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ డి. స్వాతి మరియు డాక్టర్ డి.కిరణ్ కుమార్ సహకారంతో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కళాశాల విద్యార్థులు మరియు ఇతరులు 16 రోజుల పాటు జరిగిన ఈ యొక్క కార్యక్రమం లో భాగంగా ర్యాలీ మరియు, ప్లెడ్జ్ టేకింగ్, పరిశుభ్రత పై జనాలలో అవగాహన వంటి కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. అలాగే ఈ యొక్క కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న యువతకు నెహ్రూ యువ కేంద్ర తరపున మై భారత్ లోగో కలిగిన క్యాప్, పెన్,డైరీ అందించడం జరిగింది.

# జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించిన చింతనిప్పు కృష్ణ చైతన్య

## - సంతోష్ మెమోరియల్ టోర్నీలో పాల్గొంటున్న 40 క్రికెట్ జట్లు



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** స్థానిక ఎస్సార్ అండ్ బిజీ ఎన్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సంతోష్ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలుసు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంటును జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య ప్రారంభించారు. సంతోష్ మెమోరియల్ టోర్నమెంట్లో జిల్లా వ్యాప్తంగా పలు మండలాల నుంచి 40 క్రికెట్ క్రీడా జట్లు పాల్గొంటున్నాయి. టోర్నీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్య క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభ మ్యాచ్ ను టాస్ వేసి క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ సంతోష్ మెమోరియల్ ట్రస్ట్ తరపున క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. జిల్లా నలుమూలల నుంచి పాల్గొన్న క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని పోటీపడాలి అన్నారు. టోర్నమెంట్ ను నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు సామాజిక బాధ్యతతో క్రీడా, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతకు మార్గదర్శకంగా ఉంటున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంతోష్ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బలుసు మురళీకృష్ణ , ట్రస్ట్ బాధ్యులు కోమటిల్లి సాయి కృష్ణ చైతన్య, కోనపర్తి గోపి, ఆలేటి వెంకటేష్, కొమ్ము మహేష్, కే సాయి, భరత్ చౌదరి, అభి, నాని, హనీష్, పి సాయి, సాయి చందు తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ పోటీల నిర్వహణతో కళాశాల మైదానమంతా కోలాహాలంగా మారింది.

# సర్వజ్ఞ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబురాలు





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం నగరంలో స్థానిక వి.డి.వోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్వజ్ఞ పాఠశాల ఈ సంబురాలకు వేదిక అయినది. ఈ వేడుకలో చిన్నారులు పట్టు వస్త్రాలను ధరించి బాగా ముస్తాబై తంగేడు, బంతి, చేమంతి పువ్వులతో, బతుకమ్మలను తయారుచేసి గౌరమ్మను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ, ఆడుతూ చప్పట్లు కొడుతూ విద్యార్థునులు, ఉపాధ్యాయినులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకను నిర్వహించారు. ఈ వేడుక కనులవిందుగా సాగింది పాఠశాల డైరెక్టర్ నీలిమ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణా స్త్రీలకు అతి ఇష్టమైన, ముఖ్యమైన పండుగ అని మొదటి రోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అని, చివరి రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని, తొమ్మిది రోజుల పాటు బతుకమ్మను ఆడుతారని, తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేకమైన ఈ పండుగను ప్రాచీనకాలం నుండి సాంప్రదాయకంగా జరుపుకుంటున్నామని తెలియజేశారు. మహిళలకే పరిమితమైన ఈ పండుగ ఒకరి మధ్య ఒకరికి స్నేహభావాన్ని పెంపొందించుకోవటానికి దోహదపడుతుందనీ, ఈ తరం విద్యార్థులకు మన సంస్కృతీ, సాంప్రదాయాలపట్ల గౌరవం మరియు అవగాహన కలిగించుటకు ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. పాఠశాల డైరెక్టర్ ఆర్.వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ ప్రకృతిని ఆరాధించే పెద్ద పండుగ అని, పూలు బాగా వికసించేకాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి, భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడుతుంది అని చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా జరుపుకుంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ నీలిమ, ఆర్. వి నాగేంద్రకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు మరియు ఉపదధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# నూకల నరేష్ రెడ్డి మృతి పట్ల మాజీ ఎంపీ నామ విచారం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** సీనియర్ రాజకీయ నాయకులు, మరిపెడ మండలం పురుషోత్తమయ గూడెం గ్రామానికి చెందిన నూకల నరేష్ రెడ్డి మృతి పట్ల బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. నూకల నరేష్ రెడ్డి కుటుంబంతో ఎప్పటి నుంచో సత్సంబంధాలు ఉన్నాయని, నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన ఒక మంచి మిత్రుడిని కోల్పోయానని నామ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ పార్టీలో చేరి, పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారని, 17వ లోక్ సభ ఎన్నికల్లో తన విజయానికి నూకల నరేష్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని, వారు అందించిన సహకారం మరువలేనిదని అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఆయన ప్రజల సంక్షేమానికి ఎంతో తోడ్పాటును అందించారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.




# టి.జి.ఎస్.ఆర్.టి.సి లాజిస్టిక్ సేవల విస్తరణ

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు బస్టాండ్ లకే పరిమితమైన లాజిస్టిక్ సేవలను గత నెల రోజులలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మండల, గ్రామీణ ప్రాంతాలకు విస్తరించడం జరిగిందని లాజిస్టిక్స్ ఏ.టీ.ఎం.ఏ. పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. లాజిస్టిక్స్ వినియోగదారులందరకు శరణ్ దేవి నవరాత్రులు మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ టీ.జీ.ఎస్.ఆర్టీసీ లాజిస్టిక్స్ లో అతి తక్కువ ధరలలో బుక్ చేసుకుని వేగంగా,భద్రంగా మీ పార్సెల్ పంపుకోవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాక ఆంధ్రప్రదేశ్లోని అన్ని ముఖ్యమైన పట్టణాలు మరియు బెంగుళూరు కూడా లాజిస్టిక్ సౌకర్యం కలదని తెలియజేసినారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 35 లాజిస్టిక్ కేంద్రాలు అందుబాటులో కలవని తెలియజేసినారు. బుక్ చేసుకున్న మీ పార్సెల్ గురించి తెలుసుకొనుటకు app.tgsrtclogistics.co.in ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. అతి త్వరలో హెూమ్ పికప్ మరియు హెూం డెలివరీ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. ముందుగా హైదరాబాద్ నందు ఈ సేవలను ప్రారంభించి తర్వాత అన్ని జిల్లాలకు విస్తరింపజేయనున్నామని తెలియజేసినారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా

టీ.జీ.ఎస్.ఆర్టిసి లాజిస్టిక్స్ సేవల కొరకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్ :

ఖమ్మం :9154298583
మదిర :9154298582
సత్తుపల్లి:9154298585
కొత్తగూడెం:9154298587
భద్రాచలం :9154298586
మణుగూరు :9154298588.



# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొమ్మినేపల్లి-పండితాపురం గ్రామం లో ఇంటింటి సర్వే

## -పాల్గొన్న డీసీసీబీ డైరెక్టర్ మల్లి బాబు యాదవ్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ ఆధ్వర్యంలో కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీ లో గత వారం రోజుల నుండి ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సర్వే కార్యక్రమంలో అర్హులై ఉండి రేషన్ కార్డు లేని వారిని, పెన్షన్ రాని వారిని, ఇల్లు లేనివారిని మరియు గ్రామంలోని వివిధ రకాల సమస్యలను గుర్తించడం జరుగుతుంది. శుక్రవారం నాడు జరిగిన సర్వే కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ స్వయంగా పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ 2006లో ఇలాంటి ఇందిర సర్వే కార్యక్రమాన్ని చేపట్టి గ్రామంలోని లబ్ధిదారులను గుర్తించి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని నాటి సుజాతనగర్ ఎమ్మెల్యే కీర్తిశేషులు రా%శీ% రెడ్డి వెంకటరెడ్డి గారి దృష్టికి తీసుకువెళ్లి, వారి సహకారంతో గ్రామంలోనే కాకుండా కామేపల్లిమండల వ్యాప్తంగా రాజకీయాలకతీతంగా వందలాది మందికి పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇండ్లు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో 10 సంవత్సరాల కాలంలో ఏ ఒక్కరికి రేషన్ కార్డు కొత్త పెన్షన్, కొత్త ఇల్లు మంజూరు కాలేదని, 10 సంవత్సరముల పాటు జిల్లాలోనే అతిపెద్ద ఆదాయ వనరులు ఉన్న కొమ్మి నేపల్లి పంచాయతీ నిధులను అధికారులు దుర్వినియోగపరిచారని, కామేపల్లి మండలంలో కాస్తో కూస్తో అభివృద్ధి అయిందంటే అది కేవలం కోరం కనకయ్య వల్లనే సాధ్యపడిందని, మళ్లీ ఇప్పుడు చేపట్టిన సర్వే రిపోర్ట్ ను ప్రస్తుత ఎమ్మెల్యే కోరం కనకయ్య కి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి, వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి నివేదించడం జరుగుతుందని, సమస్యల్ని పరిష్కరించడానికి ఈ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. కేవలం కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గ్రామాల అభివృద్ధి పేదలకు న్యాయం జరుగుతుందని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో గాని, 2004ముందు ఉన్న ప్రభుత్వంలో గాని ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని తెలిపారు. సర్వే కార్యక్రమమును పకడ్బందీగా నిర్వహిస్తున్న సర్వే టీం ను అభినందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను సర్వే గురించి ప్రశ్నించగా సర్వే చాలా బాగుందని, ఇన్నాళ్లు మేము దరఖాస్తులు పెట్టుకుంటే ప్రయోజనం లేకుండా పోయిందని, మా సమస్యల్ని ఇంటింటికి వచ్చి తెలుసుకొని గతంలో కూడా పరిష్కరించడం జరిగిందని, తప్పక మాకు ఈ సర్వే ద్వారా న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం పుల్లయ్య, గుగులోతు రవి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాడిబండ్ల ప్రసాదు, ఎల్ హెచ్ పి ఎస్ మండల అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు, కొమ్మి నేపల్లి మత్స్య శాఖ అధ్యక్షులు మేకల మల్లికార్జునరావు, మాజీ సర్పంచ్ భానోత్ నరసింహ నాయక్, మేకల మహేష్ బాబు, బద్దల శేఖర్,జక్కంపూడి వెంకటేశ్వర్లు చల్ల నాగేశ్వరరావు బద్దల వీరబాబు, ఉబ్బని నాగార్జున, తిమ్మట్ల అనిల్ కుమార్ ఉబ్బని ఉపేందర్, పల్లపు ప్రతాప్ కుమార్, భూక్య శ్రావణ్ కుమార్, బండి నాగరాజు,బండి ఎల్లయ్య, మేకల లక్ష్మీనారాయణ, రాయల నాగ శంకర్ బాదావత్ నాగరాజు, దేరంగుల తిరపయ్య, తదితరులు పాల్గొన్నారు

# శ్రీ రామ్ ఫైనాన్స్ ఉద్యోగులకు బాసటగా నిలిచిన సంస్థ

## -నిత్యావసర సామాగ్రి మరియు ఎలక్ట్రానిక్ గృహోపకరణ వస్తువులు వితరణ



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** శ్రీ రామ్ ఫైనాన్స్ సంస్థ పురోభివృద్ధికి మూల స్తంభాలైన ఉద్యోగులకు మున్నేరు వరద ప్రవాహనికి ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తిన సందర్భాలలో సంస్థ యాజమాన్యం వారిని తమ సొంత కుటుంబ సభ్యులుగా భావించి వారికి వివిధ రూపాల్లో సహాయ సహకారాలు అందించారు శ్రీ రామ్ ఫైనాన్స్ తెలంగాణ వైస్ ప్రెసిడెంట్ జి నరసింహారావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలోని కొన్ని ప్రాంతాలలో సంభవించిన మున్నేరు వరద విపత్తుతో గృహపకరణాలను కోల్పోయిన 32 మంది ఉద్యోగులకు 16 లక్షల రూపాయలు విలువ గలిగిన వస్తువులను వైరా రోడ్ లోని శ్రీ రామ్ ఫైనాన్స్ ఖమ్మం జోనల్ ఆఫీస్ నందు శనివారం అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఉద్యోగుల భద్రత తమ ప్రధాన బాధ్యత అని వివరించారు వరదల వల్ల తమ సంస్థ ఉద్యోగులు తీవ్ర కష్టనష్టాలు ఎదుర్కోవడం తమ సంస్థ యాజమాన్యాన్ని చాలా బాధించిందన్నారు ఇటువంటి సందర్భాలలో ఆర్థిక సహాయం కంటే గృహెూపకరణాలు ఇవ్వడమే సముచితమని యాజమాన్యం భావించిందని పేర్కొన్నారు రిఫ్రిజిరేటర్, టీవీ,గ్యాస్ పొయ్యి, రైస్ కుక్కర్, కుర్చీలు, మిక్సీ, గ్రైండర్ వంటి నిత్య వినియోగ వస్తువులను సంస్థ యాజమాన్యం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడం ఉద్యోగుల పట్ల సంస్థకు ఉన్న గౌరవాన్ని నిబద్ధతను తెలియజేస్తుందన్నారు తమ ఉద్యోగులు కూడా నిరంతరం సంస్థ అభివృద్ధికి కోసం పనిచేయాలని సూచించారు ఇతర సంస్థల వలే కాకుండా శ్రీరామ్ సంస్థ దేశవ్యాప్తంగా తమ శాఖలలో బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతి ఉద్యోగి పట్ల ఇదే రకమైన భావన కలిగి ఉందన్నారు శ్రీ రామ్ ఫైనాన్స్ కుటుంబంలో సభ్యులుగా ఉన్న ప్రతి ఉద్యోగికి ఆర్థిక భరోసా కల్పించేందుకు సంస్థ యాజమాన్యం కట్టుబడి ఉందని తెలిపారు. వరద బాధితులకు సహాయం చేయాలంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు సంస్థ యాజమాన్యం ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయలను విరాళం ఇచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు. అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ సురభి శేఖర్ శ్రీనివాసరెడ్డి. జనరల్ మేనేజర్ వాసుదేవరావు డీ జీ ఎమ్ సుధాకర్. ఆర్ బీ రామారావు. జగన్ రెడ్డి ఏ జీ ఎమ్ రాజ్ కుమార్. ఇమాంపాషా. భక్తవత్సలరావు. శ్రీనివాస్. వీరశేఖర్. జయ ప్రకాష్. విజయ్ కుమార్.మరియు మేనేజర్స్ అండ్ సిబ్బంది పాల్గొన్నారు సంస్థ ఉద్యోగులు హర్షతిరేఖం వ్యక్తం చేసారు.

## రెజోనేన్స్ శ్రీనివాస్ నగర్ లో హట్టహసంగా

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం పట్టణంలో శ్రీనివాస్ నగర్ లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి తెలంగాణా సంస్కృతి సంప్రాదాయాలకు ప్రతీక బతుకమ్మ. తెలంగాణ పేరు చెప్పగానే గుర్తుకొచ్చే పండుగ బతుకమ్మ. ఇది పులా జాతర అక్టోబర్ నెలలో వచ్చే ఆశ్వయుజ శుద్ధ పాద్యమి మొదలుకొని తొమ్మిది రోజులవరుకు రోజుకో తీరున బతుకమ్మను పూలతో పేరుస్తూ జరిపే పండుగ, ఇది తెలంగాణకు మాత్రమే సంబందిచిన పండుగ. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల డైరెక్టర్ నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తెలంగాణా ప్రతీక బతుకమ్మ వేల యేండ్ల చరిత ఉన్న ఈ పండుగ వెనుక కూడా అనేక కథలు ఉన్నాయి. చోళ రాజు అయిన ధర్మాంగదునికి వంద మంది కుమారులు వారందరు యుద్ధంలో మరణిస్తారు. చాల కాలం తరువాత లక్ష్మిదేవి అనుగ్రహంతో వారికీ ఆడపిల్ల పుడుతుంది ఆమెకు బతుకమ్మ అని పేరు పెట్టి నిండు నూరేళ్ళు బతుకాలని అందరు ఆశీర్వదిస్తారు. అ అమ్మాయి బతుకమ్మ అని పూజలు అందుకుంటుందని విద్యార్థిని చిన్నారులకు తెలియజేసారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ ఆటపాటలు లేకుండా సభా సమావేశాలు జరగలేదని ఉద్యమ పోరాటంలో స్త్రీలను భాగస్వాములను చేసి బతుకమ్మలను ఎత్తుకొని వచ్చి పోరాట బిడ్డలకు స్వాగతం చెప్పి నుదుటన వీర తిలకం దిద్దిన గొప్ప చరిత్ర బతుకమ్మ అని విద్యార్థులకు తెలియజేసారు, కరెస్పాండెంట్ నీలిమ మాట్లాడుతూ తెలంగాణా ఆడపడుచులు బతుకమ్మ ఆడితే ప్రకృతి పులకరిస్తుందని మనకంటూ ఒక విశిష్టత



ప్రత్యేక సంస్కృతి సంప్రదాయం ఉందని, అన్ని కులాలు సమానత్వంగ జరుపుకునే పండుగ బతుకమ్మని తెలియజేస్తూ ప్రకృతితో ముడిపడిన పండుగ పువ్వులనే దేవుడిగాకొలవడం తమ బ్రతుకులను, కష్టాలనే పాటలుగా పడుకోవటం ఒక తెలంగాణా ప్రజలకు మాత్రమే చెందిదని ఎంతో బక్తి శ్రద్దలతో బతుకమ్మ పండుగను జరుపుకుంటారని తెలియజేసారు. బతుకమ్మ పేర్చడంలో వాడె ఆకులు, పువ్వులు మంచి ఔషదాలు. వీటిని చెరువులో కలపటం వల్ల నీటి శుద్ధి జరుగుతుందని విద్యార్థులకు తెలియజేసారు ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి రంగు రంగుల పూలతో కళాత్మకంగా బతుకమ్మలను తయారుచేసుకొని వచ్చి బతుకమ్మల చుట్టురా ఆటపాటలతో నృత్యాలను చేస్తూ సందడి చేయడం అందరిని ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొని సందడి చేశారు

# ఘనంగా జీవి మాల్ ప్రారంభోత్సవం



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం నగరంలోని అతిపెద్ద షాపింగ్ మాల్ అయిన జీవీమాల్ ప్రారంభోత్సవం శనివారం ప్రముఖ సినీనటి కీర్తిసురేష్, జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీనటి కీర్తిసురేష్ చేతుల మీదగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో వచ్చిన ప్రేక్షకులతో ఫొటోస్ దిగుతూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం గడ్డమీదపుట్టి వ్యాపార లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న వ్యక్తి జీవీమాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరావు అని కొనియాడారు. హైదరాబాద్ తర్వాత ఖమ్మంలో ఎన్నో పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ వెలిశాయని, వాటన్నిటితో పోటీపడుతూ ఎక్కడా రాజీ పడకుండా సంపదతో సంబంధం లేకుండా సరసమైన ధరలకు నాణ్యమైన వస్త్రాలను అందిస్తూ గత 70 సంవత్సరాలుగా వ్యాపారం చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి తొలిసారిగా రిమోట్ కంట్రోల్ తో అతిపెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఓపెన్ చేశారు. జీవీ మాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా ఈ వ్యాపారం చేస్తున్నామని, క్వాలిటీతో సరసమైన ధరలకు వస్త్రాలను అందించడంలో ఎక్కడా రాజీ పడలేదని తెలిపారు. జీవి మాల్ సంస్థ ద్వారా పదివేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ఆంధ్ర, తెలంగాణ కలిపి 17 బ్రాంచ్లు ఓపెన్ చేశామని, ముందు ముందు కూడా ఇలాగే కష్టపడుతూ ప్రజలకు నాణ్యమైన సరసమైన ధరలకు దుస్తులను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కామార్థపు మురళి, తుంబూరి దయాకర్ రెడ్డి, పునకొల్లు నీరజ పాల్గొన్నారు.

# ఘనంగా జెడ్పీలో నానే బియ్యం బతుకమ్మ వేడుకలు



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** జెడ్పిలో నానే బియ్యం బతుకమ్మ వేడుకలను తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా ఘనంగా నిర్వహించారు. నాల్గవ రోజు శనివారం సాయంత్రం పూల పండుగ బతుకమ్మ వేడుకలలో భాగంగా జెడ్పీలో పూలతో పేర్చిన బతుకమ్మలతో జెడ్పీ సిఈఓ దీక్ష రైనా, డిప్యూటీ జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, పెద్ద ఎత్తున మహిళలు, వివిధ శాఖలలోని మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొని గౌరమ్మ తల్లిని పూజించి, బతుకమ్మలను పేర్చి ఆట, పాటలతో సందడి చేస్తూ బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.

# శ్రీ ఆదర్శ లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** చింతకాని మండలం నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంప్రదాయాన్ని ఉట్టిపడేలా విద్యార్థులు చేసిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ ఆట, పాటలతో సంతోషంగా గడిపారు. బతుకమ్మ వేడుకలు ఆవశ్య కత గురించి పాఠశాల కరస్పాండెంట్ బోడెపుడి కిరణ్ విద్యార్థులకు వివరించారు. వేడుకలు అనంతరం బతుకమ్మలను సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయినీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# అర్హత గల ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేసుకోవాలి

## -అదనపు కలెక్టర్ డి. మధు సూదన్ నాయక్



**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** అర్హత గల ప్రతీ ప్రభుత్వ ఉపాధ్యాయులు, నవంబర్ 6 లోపు వరంగల్ - ఖమ్మం - నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లుగా నవెూదు అయ్యేలా పటిష్ట కార్యాచరణ చేపట్టాలని జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అదనపు కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వరంగల్ - ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం అక్టోబర్ 16, 25 తేదీలలో వార్తా పత్రికలలో మొదటి, రెండవ రిపబ్లికేషన్ నోటీసులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన ఉపాధ్యాయులు నవంబర్ 6 లోపు ఫారం 19 ద్వారా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కొరకు దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. 2019 న జరిగిన గత ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా నుండి మొత్తం 3634 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు గా నమోదయ్యారని, ఇందులో 2318 మంది పురుష, 1316 మంది మహిళా ఉపాధ్యాయులు ఉన్నట్లు అదనపు కలెక్టర్ అన్నారు. గతంలో నమోదు చేసుకున్న వారు, జరగబోయే ఎన్నికలకు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ అన్నారు. 1నవంబర్, 2024 కు ముందు 6 సంవత్సరాలలో కనీసం మూడు సంవత్సరాల పాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యా బోధనలో నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులని అదనపు కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు సంబంధించి ఓటర్ల జాబితాలను ఎన్నికల ముందు ప్రతిసారి కొత్తగా తయారు చేస్తామని, గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా ఫారం -19 ప్రకారం నూతనంగా దరఖాస్తును నవంబర్ 6 లోపు సమర్పించాల్సి ఉంటుందని అదనపు కలెక్టర్ అన్నారు. అర్హులైన ఉపాధ్యాయులు తమ దరఖాస్తులను సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ ఫారం 19 ప్రకారం తహసిల్దార్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయం నందు మాన్యువల్ గా లేదా ceotelangana.nic.in అనే వెబ్ సైట్‌లో ఆన్లైన్ ద్వారా నవంబర్ 6 లోపు దరఖాస్తు చేసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈసమావేశంలో జిల్లావిద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాల్గొన్నారు.

## ఫాగడీ ధరించి

# బతుకమ్మ ఆడిన అమ్మాయిలు

**-సంప్రదాయా వేషధారణలో ఆకట్టుకున్న అమ్మాయిలు**

**-నగదు బహుమతి అందించిన నిర్వాహకులు**





**నిజామాబాద్,తెలంగాణ ముచ్చట్లు:** నిజామాబాద్ జిల్లా,రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో బతుకమ్మ సంబరాల్లో భాగంగా నాల్గవ రోజు నాన బియ్యం బతుకమ్మను శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఒక అమ్మాయిల సమూహం, తమ అందమైన సంప్రదాయ వేషధారణతో సర్వత్రా ప్రశంసలు అందుకున్నారు. తెలంగాణ పూల పండుగ సందర్భంగా అందమైన చీరలు, పట్టు పరికిణీలు ధరించి, ప్రత్యేకంగా పాగడులు వేసుకొని, ఆడిన బతుకమ్మ ప్రేక్షకులందరి మన్ననలు పొందింది. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం నిర్వాహకులు వీరిని సన్మానించి, ప్రత్యేక,సంప్రదాయ వేషధారణలో బతుకమ్మ ఆడిన మోక్ష,దీక్ష,మేఘన, ధన,మేధ్య,నందిని లను అభినందించి,నగదు బహుమతిని అందించారు. వీరి తపన, సంప్రదాయపాలన అందరినీ ఆకట్టుకోగా, గ్రామస్థులు, ఇతర సాంస్కృతిక సంఘాలు వారిని అభినందించాయి.



ఇలాంటి పండుగలు మన సంప్రదాయాలను, మన సంస్కృతిని కొత్త తరాలకు పరిచయం చేస్తాయి, అని నిర్వాహకులు చెప్పుకొచ్చారు.

# రైతులు లాభదాయక ఆయిల్ పామ్ పంట వేయాలి

**- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**- రైతు సంక్షేమ పథకాలను క్రమ క్రమంగా అమలు చేస్తున్నాం**

**- రఘునాధపాలెం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** రఘునాథపాలెం మండలంలోని రైతులు లాభదాయకమైన ఆయిల్ పామ్ సాగు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శనివారం రఘునాథపాలెం మండలంలోని కోటపాడు, వి.ఆర్. బంజర, జి.కె. బంజర, పాపటపల్లి , చిమ్మపూడి గ్రామాల్లో మంత్రి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మంత్రి, ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులతో జి.కె. బంజర గ్రామంలో రూ. 17 లక్షల అంచనాతో చేపట్టే 5 అంతర్గత సిసి రోడ్ల పనులకు, వి.ఆర్. బంజర గ్రామంలో రూ. 21 లక్షలతో చేపట్టే 4 అంతర్గత సీసీ రోడ్డు పనులకు, పాపటపల్లి గ్రామంలో రూ. 13.5 లక్షలతో చేపట్టే 10 అంతర్గత సీసీ రోడ్డు పనులకు, కోటపాడు గ్రామంలో రూ. 56 లక్షల 50 వేల వ్యయంతో చేపట్టిన 23 అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు, చిమ్మపూడి గ్రామంలో రూ. 90 లక్షలు వ్యయంతో చేపట్టిన 20 అంతర్గత సిసి రోడ్ నిర్మాణ పనులకు, సి.ఆర్.ఆర్. నిధుల ద్వారా రూ. 2 కోట్ల 85 లక్షల వ్యయంతో చేపట్టిన కోటపాడు నుంచి పాపటపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి పనులు నాణ్యతతో, సరిగ్గా పూర్తి చేయాలని మంత్రి అన్నారు. మండలంలో స్థలం ఉండి, ఇండ్లు లేని పేదల జాబితా (గుడిసెలు, రేకుల ఇండ్లలో ఉన్న వారి) జాబితా ఫోటోలతో సహా తయారు చేయాలని, వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సేకరించాలని మంత్రి అన్నారు. ఖమ్మం నుంచి డోర్నకల్ వెళ్లే బస్సు బుగ బంజరా గ్రామం వయా వెళ్లే విధంగా చూడాలని ప్రజలు కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి ప్రజల ప్రయోజనార్థం చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. పామాయిల్ సాగు చేసిన, మిర్చి పంట అంతర్ పంట కింద సాగు చేయవచ్చని, రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని మంత్రి సూచించారు. 2 లక్షల పై రుణాలు ఉన్న రైతులకు కూడా త్వరలో షెడ్యూల్ ప్రకటించి రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని, రైతు భరోసా పథకం త్వరలో అమలు అవుతుందని మంత్రి తెలిపారు. పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందని, రైతుల తరపున పూర్తి స్థాయిలో భీమాను ప్రభుత్వమే చెల్లిస్తుందని అన్నారు. రఘునాథపాలెం మండలం రైతులు పూర్తి స్థాయిలో ఆయిల్ పామ్ పంటలు వేయాలని, రాబోయే నెలలో ఎత్తిపోతల పథకం పెట్టి మండలంలోని అన్ని గ్రామాలకు



సాగర్ నీళ్లు తీసుకు వచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని, ధైర్యంగా రైతులంతా మొక్కలు వేయాలని, రైతులకు మంచి ఆదాయం వస్తుందని అన్నారు. జమ్ములబాగు బావిలో క్లీనింగ్ చేయాలని, త్రాగునీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రెండు పడక గదుల పెండింగ్ పనులు పూర్తిచేసి సంక్రాంతి నాటికి లబ్ధిదారులకు అందజేయాలని మంత్రి ఆదేశించారు. మండలంలో పెండింగ్ ఉన్న 2 అంగన్వాడి భవనాలు, లింక్ రోడ్లు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ పంచాయతీ రాజ్ వెంకట్ రెడ్డి, తహసిల్దార్ విల్సన్, ఎంపిడిఓ అశోక్, ఎం.పి.ఓ. శ్రీనివాస్ రెడ్డి, డీ.ఈ మహేష్, ఏఈ చిరంజీవి , వ్యవసాయ శాఖ ఏ.ఓ, ప్రజా ప్రతినిధులు, ఆర్.డబ్ల్యూ.ఎస్., ఆర్ అండ్ బి అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆత్మకూరు మండలం. కొట్టాల చెరువు గ్రామంలో రెండు కోట్ల 30 లక్షల నిధులతో వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ

**-వసతి గృహ నిర్మాణానికి భూమి పూజ చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, కలెక్టర్ శ్రీమతిరాజకుమారి**

**-విద్యతోనే చెంచుల అభివృద్ధి సాధ్యం**



నంద్యాల జిల్లా. ఆత్మకూరు: ప్రధానమంత్రి జన్ మన్ పథకంలో భాగంగా ఆత్మకూరు మండలం కొట్టాల చెరువు గ్రామంలో 2.30 కోట్ల నిధులతో వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ వెలుగోడు గండిపేట కాలనిలో రూ.2.70 కోట్ల నిధులతో 100 మంది విద్యార్థులకు మరో వసతి గృహ నిర్మాణానికి భూమిపూజ చేసిన శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి , కలెక్టర్ శ్రీమతి రాజకుమారి . కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రతి గిరిజన కుటుంబం జీవన ప్రమాణాలు పెంపొందించుకోవాలి. సంప్రదాయాలను వీడకుండా ఆధునిక ప్రపంచంతో చెంచులు పోటీపడాలి. ప్రతి చెంచు కుటుంబానికి పక్కా గృహాన్ని నిర్మించి అందిస్తాం, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే బుడ్డా 50 ఏళ్లకే చెంచులకు పెంచన్ ఇచ్చిన ఘనత సిఎం చంద్రబాబు నాయుడు ది కొట్టాల చెరువు, వెలుగోడు లలో చెంచులతో సమావేశంలో ప్రసంగించిన శ్రీశైలం ఎమ్మెల్యే శ్రీ బుడ్డా రాజశేఖర రెడ్డి , కలెక్టర్ శ్రీమతి రాజకుమారి.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక





## సుప్రీం కోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం..

### - తెలంగాణ టీడిపి జాతీయ కార్యదర్శి జె. దశరథ్

హైదరాబాద్ అక్టోబర్ 5 తెలంగాణ ముచ్చట్లు : గత నెల రోజుల గా తిరుమల ఏడుకొండల స్వామి ప్రసాదంలోని. లడ్డులలో లోపాలో జరుగుతున్న తంతును నేడు న్యాయస్థానం సుప్రీం కోర్టు రివ్యూ చేసిన అనంతరం జస్టిస్ గవాయి ఒక స్వతంత్ర సంస్థతో దర్యాప్తునకు ఆదేశించాలని సుప్రీం కోర్టు నిర్ణయాన్ని తెలుగు దేశం పార్టీ స్వాగత తీస్తుందని తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రచార కార్య దర్శి. జె దశరథ్ ఈనిర్ణయాన్ని స్వాగతించారు. ముఖ్యంగా ఈ సంస్థలో సీబీఐ డైరక్టర్ తోపాటు యాఫ్ ఏస్ ఏస్ ఏ ఐ తోపాటు ఆంధ్ర ప్రదేశ్ లో నీ ఇద్దరు పోలీస్ అధికారులను చేర్చడం ఆహ్వానిచ తగ్గ పరిణామముగా అని దశరథ్ పేర్కొన్నారు. సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ మాసుద్ దీనికి సార్యద్యం వహిస్తారని జస్టిస్ గావాయ్ పేర్కొన్న రని దశరథ్ చెప్పారు. తిరుమల దేవదేవుని కీ సమక్షంలో కోట్లాది మంది భక్తులకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్న పరిణామంగా దేశవిదేశాల్లో ఇదే అంశం చర్చ నియంశం గా ఉంది అని దశరథ్ పేర్కొన్నారు. ముఖ్యంగా సుప్రీం కోర్టు తమకంట్టు ఒక్క కాటప్ డేట్ పెట్టి సాధ్యమయ్యే వరకు త్వరగా పూర్తి చేయాలని కోరారు. సుప్రీమ్ కోర్టు తీర్పు పట్ల తెలుగు దేశం పార్టీ హర్షం వ్యక్తం చేశారు.



## వెంకటస్వామి( కాకా) 95వ జయంతి వేడుకలు

### జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కల్వల రామచందర్

కరీంనగర్ జిల్లా అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు : కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు కల్వల రామచందర్ మాట్లాడుతూ ఈరోజు రవీంద్రభారతిలో జి వెంకటస్వామి( కాకా )95వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క పార్టీ పార్లమెంటు సభ్యులు ఎమ్మెల్యేలు పలువురు నాయకులు జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది ఇందులో మా కరీంనగర్ ముద్దుబిడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒకప్పుడు వెంకట్ స్వామి సన్నిహితంగా ఉండే ఎన్ ఎస్ యు ఐ లో ఉన్నప్పుడు గతంలో పెద్దపెల్లి పార్లమెంటు పోటీలో ఉన్నప్పుడు వెంకటస్వామి తొ పొన్నంప్రభాకర్ ఉద్యమాలలో చురుకుగా పాల్గొనే వారు పొన్నం ప్రభాకర్ అంటే వెంకటస్వామి గారికి అభిమానం గా ఉండే వ్యక్తిగా నిలిచిపోయారు, ఈరోజు కరీంనగర్ ముద్దుబిడ్డగా సంక్షేమ రవాణా మంత్రిగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఇంకా ఎన్నో పెద్ద పదవులు రావాలని కరీంనగర్ ప్రజల తరఫున కోరుకుంటున్నామని తెలిపారు.

# ప్రసవ మహిళలను పట్టించుకోని వైద్యులు

### -నాణ్యమైన వైద్యం అందించేలా ఎమ్మెల్యే కృషి చేయాలి
### -సీపీఐ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి : కడారి రాములు




ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చీఫ్ (వేములవాడ) అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు : రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలోని ఏరియా హాస్పిటల్ కు ప్రసవానికి వచ్చిన మహిళలు 3,4 గంటలుగా ప్రసవ వేదనతో ఇబ్బందులు పడుతున్నా, వైద్యులు,సిబ్బంది పట్టించుకోవడం లేదని,ప్రధాన వైద్యాధికారికి చెప్పినప్పటికీ,నొప్పులు వస్తాయి ఓర్చుకోవాలని ఉచిత సలహాలిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ పార్టీ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి కడారి రాములు తీవ్రఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెలివరీ చేసే డ్యూటీ డాక్టర్ ఆపరేషన్ థియేటర్లో ఉ ందని,డెలివరీకి వచ్చిన వారిని పట్టించుకునేవారే లేరని,పైగా బీపీ ఎక్కువ ఉన్నా,తక్కువ ఉన్నా వారిని ప్రయివేటు హాస్పిటల్ లేదా సిరిసిల్ల,కరీంనర్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారని,కోట్లాది రూపాయల వ్యయాన్ని వెచ్చించి ఏరియా ఆస్పత్రి నిర్మాణం చేపడితే హాస్పిటల్లో నిర్లక్ష్యంతో పాటు,ఇతర ప్రాంతాల హాస్పిటళ్లకు వెళ్ళమని సూచించడం ఏంటని ప్రశ్నించారు.స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక దృష్టి సారించి, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకొని నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేయాలని కడారి రాములు విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక "బతుకమ్మ పండుగ"

### - ఎస్వీజేసి కళాశాల చైర్మన్ : మహిపాల్ రెడ్డి
### - ఎస్వీజేసి బాలికల కలశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు




ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చీఫ్ (కరీంనగర్) అక్టోబర్ 05తెలంగాణ ముచ్చట్లు : నగరంలోని శ్రీ వేంకటేశ్వర బాలికల జూనియర్ కలశాలలో బతుకమ్మ సంబరాలను శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ముందుగా ఎస్వీజేసి విద్యాసంస్థల చైర్మన్ మహిపాల్ రెడ్డి,డైరెక్టర్లు వరప్రసాద్,రాంరెడ్డి, సింహాచలం హరికృష్ణ,వంగల సంతోష్ రెడ్డి లు బతుకమ్మ సంబరాలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులందరూ సంప్రదాయ దుస్తులు ధరించి, తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను కళాశాల ప్రాంగణంలో పెట్టి ఉపాధ్యాయులు,విద్యార్థులు బతుకమ్మ ఆట,పాటలతో ఆధ్యాత్మిక వాతవరణాన్ని సంతరించుకుంది.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు రాంరెడ్డి,హరికృష్ణ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని, ఆడపడుచులు ఎంతో ఇష్టంగా, భక్తిశ్రద్ధలతో 9 రోజుల పాటూ అమ్మవారిని అలంకరిస్తూ,తీరొక్క పూలతో, నైవేద్యాలతో అమ్మవారిని కొలుస్తారని అన్నారు.అనంతరం కార్యక్రమంలో విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకి ముందస్తు బతుకమ్మ పండుగ శుభకాంక్షలను తెలియజేశారు.

### ప్రత్యేక పూజలు నిర్వహించిన
## కాంగ్రెస్ సీనియర్ నేత గంగం రవి



హైదరాబాద్ అక్టోబర్ తెలంగాణ ముచ్చట్లు : :దసరా నవరాత్రుల... సందర్భంగా టి.ఆర్.టి లో శ్రీ గజానంద్ భక్తి సమాజ్ ఆధ్వర్యంలో గత 22 సంవత్సరాల నుండి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించి పూజిస్తున్నారు. ప్రతి సంవత్సరంలాగే ఈసారి కూడా అమ్మవారిని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు . ఈరోజు సాయంత్రం కాంగ్రెస్ సీనియర్ నేత గంగం రవి , విశ్వా హిందూ పరిషత్ తెలంగాణ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి , హైదరాబాద్ ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ చిలుకూరి హరి ప్రసాద్ , బిఆర్ఎస్ నేత ఐలి శ్రీనివాస్ , బీజేపీ నేత గాదె శ్రీనివాస్(పాల శ్రీను) , జర్నలిస్ట్ అసోసియేషన్ అఫ్ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు చిలుకూరి అఖిలేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . పూజల అనంతరం మండప నిర్వాహకుడు బీజేపీ నాయకుడు దోనేటి సత్యం అందరిని శాలువాతో సత్కరించారు. సత్యం తో పటు శ్రీ గజానంద్ భక్తి సమాజ్ అధ్యక్షుడు విశ్వనాధ్, బీజేపీ నేత లక్ష్మీనారాయణ(బంటీ), దోనేటి ఉల్లాస్, దోనేటి విరాట్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్రమంత్రి బండి సంజయ్ ను కలిసిన రెడ్డేడ్డి శ్రీనివాస్

కరీంనగర్ జిల్లా అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు : కరీంనగర్ ఈరోజు 59 వ డివిజన్ ఇంచార్జ్ శక్తి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డేడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిజెపి ప్రచారం సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది ప్రతి ఇంటింటికి సభ్యత్వం తీసుకోవడం జరిగింది ఇందులో భాగంగా మహాశక్తి దేవాలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ను కలిసిన బిజెపి 59 వ డివిజన్ కార్యకర్తలు నాయకులు కలవడం జరిగింది.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు




కరీంనగర్ జిల్లా అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు : కరీంనగర్ పట్టణ కేంద్రంలో ప్రభుత్వం జూనియర్ కళాశాలలో (ఆర్ట్స్ అండ్ కామర్స్ ) ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కరీంనగర్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి సంబరాలు ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి బతుకమ్మ దాని గొప్పధనం గురించి విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వి,సత్య వర్ధన్ రావు సీనియర్ లెక్చరర్ వి ప్రమీల మరియూ అధ్యాపకులు రవీందర్ రెడ్డి, జక్రియా ఉద్దీన్, ఉషారాణి, పద్మ, శ్రీనివాస్, రమేష్, కళాశాల (న్ ఎస్ ఎస్) ప్రోగ్రామ్ అధికారి బి, సంపత్, చంద్రశేఖర్, దివాకర్, సత్యం, శ్రీకాంత్ రెడ్డి, మరియూ అధ్యాపక బృందం విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## డివిజనల్ మేనేజర్ కార్యాలయాన్ని ప్రారంభించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు



కొమురం భీం జిల్లా అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు : కాగజ్ నగర్ పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో నూతన ఎఫ్డీసి డివిజనల్ మేనేజర్ కార్యాలయాన్ని ఎఫ్డీసి చైర్మన్ శ్రీ పోడెం వీరయ్య గారితో కలిసి ప్రారంభించిన సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు. ఈ సందర్భంగా శ్రీ పోడెం వీరయ్య మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కృషి చేస్తామని తెలియజేయడం జరిగింది.సిర్పూర్ శాసన సభ్యులు డా.పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా విరివిగా ప్లాంటేషన్లు పెంచి పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్నారని కొనియాడారు. ఎకోటూరిజం ప్రాజెక్టుల కింద సిర్పూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలను ఎంపిక చేయాలని చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ డి.వి రెడ్డి గారిని కోరడం జరిగింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU



# గృహప్రవేశం కార్యక్రమంలో లయన్ నీలి ప్రకాష్

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ( చర్ల మండలం), తెలంగాణ ముచ్చట్లు : అక్టోబర్ 05 :** చర్ల మండలం లో నూతన గృహప్రవేశం కార్యక్రమం లో లయన్ నీలి ప్రకాష్ పాల్గొన్నారు, మిత్రుడు మీకోసం మేమున్నాము సంస్థ సభ్యుడు కావ్వాల రాము నూతన గృహప్రవేశం కార్యక్రమం లో పద్మసాలి సంఘ సభ్యులు మిత్రులు పాల్గొన్నారు.


# పార్థివ దేహానికి నివాళు లర్పించిన భద్రాచలం ఎమ్మెల్యే

## - డాక్టర్ తెల్లం వెంకట్రావు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (దుమ్ముగూడెం మండలం), తెలంగాణ ముచ్చట్లు : అక్టోబర్ 05 :** దుమ్ముగూడెం మండలం అచ్చుతాపురం గ్రామంలో మాజీ వార్డ్ మెంబర్ భర్త కీ,,శే,, కొడిమి వేంకటేశ్వర రావు మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళు లర్పించిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ఈ కార్యక్రమంలో మండల నాయకులు లంక అబ్బులు, మట్టా శివాజీ , బత్తుల శోభన్, కల్లురి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ అధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చీఫ్(వేములవాడ) తెలంగాణ ముచ్చట్లు : అక్టోబర్ 05 :** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ కోర్టు ఆవరణలో వేములవాడ బార్ అసోసియేషన్ అధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ పండుగ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలో జూనియర్ సివిల్ జడ్జి కం జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ జడ్జి జ్యోతిర్మయి,బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం,ఏజీపీ పొత్తూరి అనిల్, సీనియర్ న్యాయవాదులు కిషోర్ రావు, బొడ్డు ప్రశాంత్,నాగుల సంపత్,నేదూరి అభిలాష్, అనిల్ జూనియర్ సివిల్ కోర్టు పర్యవేక్షకులుఅంజయ్య,తదితర కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటసుబ్బయ్య కుటుంబాన్ని పరామర్శించిన.శిల్పా చక్రపాణి రెడ్డి



**నంద్యాల జిల్లా. ఆత్మకూరు:- తెలంగాణ ముచ్చట్లు :** శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండలం గత కొన్ని రోజుల కిందట నల్లకాల్వ గ్రామం చెందిన గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్ఆర్సిపి నాయకులు వెంకటసుబ్బయ్య మరియు వారి కుమారుడు వెంకటరమణ మూడు రోజుల వ్యవధిలో మరణించారు. ఈ విషయం తెలుసుకొని ఈరోజు ఆ కుటుంబాన్ని శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పరామర్శించారు.

# మంత్రి కొండా సురేఖ వెంటనే రాజీనామా చేయాలి

## - నిరాధారంగా చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

## -చొప్పదండి మాజీ శాసనసభ్యులు : సుంకె రవిశంకర్



**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చీఫ్(గంగాధర) అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు :** తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ సినీ తారలు సమంత,రకుల్ ప్రీత్ సింగ్,తెలంగాణ రాష్ట్ర ఐకాన్ గా ప్రసిద్ధి గాంచిన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని, క్షమించరానిదని వెంటనే తన ఎమ్మెల్యే పదవికి, మంత్రి పదవికి రాజీనామా చేయాలని చొప్పదండి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ బూరుగుపల్లి లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ డిమాండ్ చేశారు.కొండా సురేఖ చేసిన నిరాధారమైన,అవాస్తవమైన ప్రకటనలు అసభ్యకరంగా, జుగుప్సాకరంగా ఉన్నాయని, ప్రజా సేవకురాలిగా, ప్రజలకు రక్షణగా ఉండాలన్న సామాజిక బాధ్యతను,నైతికతను మరిచిపోయి ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి గడించిన మాజీ మంత్రి కేటీఆర్ పై బురదజల్లే ప్రయత్నంగా అనుచితంగా వ్యాఖ్యానించిన మంత్రి కొండా సురేఖ వెంటనే ఎమ్మెల్యే,మంత్రి పదవులకు రాజీనామా చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని,ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే ఊరుకునేది లేదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హెచ్చరించారు.

# ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నూతన కార్యవర్గం



**ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చీఫ్ (బోయినిపల్లి) అక్టోబర్ 05 తెలంగాణ ముచ్చట్లు :** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలో శనివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు రాగుల రాములు,నాలుక సత్యం,రొడ్డ రామచంద్రం,దోసల చంద్రం అధ్వర్యంలో బోయినిపల్లి మండల మాల ప్రతినిధులు బొలుమాల శంకర్, జంగం అంజయ్య సమక్షంలో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షులుగా రాకం రాజేష్,ఉపాధ్యక్షులుగా కాడే భాస్కర్,ఇడుగు నరేష్,ప్రధానకార్యదర్శి జంబుక ఆనంద్,కోశాధికారిగా దాసరి బాబు,సంయుక్త కార్యదర్శిగా మండల నరేష్, ఎర్ర రవి,నిమ్మల సాగర్, యాద ప్రేమ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా ఈసారి రాజారామ్,వేల్పుల బాబు,రాకం అనిల్,రాకం మహేందర్,సోషల్ మీడియా ఇంచార్జి బిట్ల ప్రవీణ్ కుమార్ లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఈడుగు అంజయ్య,ఈడుగు స్వామి,వంకాయల భూమయ్య,లింబాద్రి,తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు దసరా పండగ కానుక కిరాణా సరుకుల పంపిణీ

**కర్నూలు, తెలంగాణ ముచ్చట్లు :** దుర్గామాత ఆశీస్సులతో కర్నూలు నగరం అంతా విజయదశమి దసరా పండుగ గడపగడపలో ఆనందం నింపాలని నిరుపేదలు సైతం దసరా పండుగ ఆనందంగా జరుపుకోవాలని హనుమాన్ కళా సమితి అధ్యక్షులు పెనికలపాటి హనుమంతరావు చౌదరి ఈరోజు ఉదయం 11 గంటలకు కర్నూలు నగరం మండలి రోజా వీధి యందు మహిళలకు వృద్ధులకు కిరాణా సరుకులను పంపిణీ చేయడం జరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ చేయూత కరువై బతుకు బరువై పెరిగిన ధరలకు పోటీ పడలేక కార్మిక కర్షకులు ఆర్థిక భారంతో జీవనం గడుపుతున్నారని, వారి కుటుంబాలలో దసరా పండగ ఆనందం కలిగించే అవకాశం ఈ కిరాణా సరుకుల పంపిణీ వల్ల సేవా భావంతో అందించడం జరిగిందని కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా సహకారం అందించారు. కర్నూలు నగర ప్రజలు కులమతాలకు అతీతంగా విజయదశమి దసరా పండుగను జరుపుకోవాలని, కర్నూలు గడపగడప ఆనందం నింపాలని ఆకాంక్షించారు. సహకారం అందిస్తున్న కళా సమాజాల ప్రతినిధులకు రోజా విధి మహిళా సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత అభినందనలు తెలియజేశారు. కర్నూలు నగరం నందలి రోజా వీధి యందు ఉచితంగా నిరుపేదలకు కిరాణా సరుకులను సంఘ ప్రతినిధులు పెనికలపాటి హనుమంతరావు చౌదరి, కర్నూలు కళాకారుల సేవ కేంద్రం అధ్యక్షులు బైలుప్పల షఫీయుల్లా, రోజా వీధి మహిళా సంఘం నాయకురాలు మీసాల సుమలత, కర్నూలు జిల్లా కార్మిక శాఖ కమిషనరు వెంకటేశ్వర్లు, విజయదశమి దసరా శుభాకాంక్షలు ముందస్తుగా తెలియజేస్తూ 48 వ వార్డు కార్మికులు భవన నిర్మాణ కార్మికులు ఆంజనేయులు, నాగన్న , రాముడు, కృష్ణుడు, మెహబూబా, శేషమ్మ పార్వతమ్మ, శంకరమ్మ, ఫాతిమా, మరియు ప్రజా ప్రతినిధి ఎం రామస్వామి రోజా వీధి వృద్ధులకు మహిళలకు కిరాణా సరుకులు పంపిణీ చేశారు.



# ప్రజలకు వెంకటస్వామి ఎనలేని సేవలందించారు

## -ఎంపీడీఓ : భీమా జయశీల

## -మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా కాకా జయంతి వేడుకలు

**జన సంఘర్షణ ప్రతినిధి : ఉమ్మడి కరీంనగర్ బ్యూరో చీఫ్(బోయినిపల్లి) అక్టోబర్ 05 :** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర్య సమరయోధులు,కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి సందర్భంగా శనివారం ఎంపీడీఓ భీమా జయశీల అధ్వర్యంలో కాకా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తెలంగాణ తొలి,మలిదశ ఉద్యమకారుడిగా,సింగరేణి బాంధవుడిగా,కార్మిక పక్షపాతిగా వెంకటస్వామి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఎం.పీ.ఓ. శ్రీధర్,పర్యవేక్షకులు రవీందర్,ఏ.పీ.ఓ.సబిత, సీనియర్ సహాయకులు సురేష్ కుమార్,జూనియర్ సహాయకులు శ్రీనివాస్,సిబ్బంది వంశీకృష్ణ రెడ్డి,తదితర సిబ్బంది పాల్గొన్నారు.




# అధిక ధరలను నియంత్రించాలి


## - సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో రాస్తారోకో

**మంచిర్యాల జిల్లా( బెల్లంపల్లి )అక్టోబర్ 05తెలంగాణ ముచ్చట్లు :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణ కాంటా చౌరస్తాలో పెరిగిన నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఉల్లిగడ్డ, అల్లం, వెల్లుల్లి సహా నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకట్ స్వామి సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. ఈ సందర్భంగా నిత్యావసర వస్తువులను ధరలను తగ్గించాలని నినాదాలు చేశారు. అనంతరం మీడియాను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే నిత్యావసరాల ధరలను తగ్గిస్తామని చెప్పిన నరేంద్ర మోడీ మూడోసారి అధికారంలోకి వచ్చినా ధరలను నియంత్రించలేదని అన్నారు. దేశంలో ఉల్లి, వెల్లుల్లి కొరత లేకున్నా దళారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు భారీగా పెరగడానికి కారణమవుతున్నారని, అలాంటి దళారులు, బ్లాక్ మార్కెట్ దారులపై చర్యలు తీసుకోకుండా వారికి కొమ్ముగాస్తున్నారని విమర్శించారు. నిత్యావసర వస్తువును అక్రమంగా నిల్వలు చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నిత్యవసర సరుకుల ధరలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని, లేని ఎడల ప్రజల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లంపూర్ణిమ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ, పట్టణ సహాయ కార్యదర్శి బియ్యాల ఉపేందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొంకుల రాజేష్ , జిల్లా సమితి సభ్యులు గుండా చంద్రమాణిక్యం, అక్క పెల్లి బాపు, లింగాల అమృత,ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బొల్లం సోని, రత్నం ఐలయ్య, బొంకూరి రామచందర్, రత్నం రాజం, బొల్లం తిలక్ అంబేద్కర్, పుట్ట శీను, గుండా ప్రశాంత్, తిరుపతి, మారాలు, గోలేటి రాజలింగు, తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక



# సినిమా న్యూస్



## హర్రర్ డైరెక్టర్ తో మాస్ రాజా న్యూ కాంబో




మాస్ మహారాజ్ రవితేజ హిట్, ఫ్లాప్ తో సంబంధం లేకుండా బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తున్నాడు. ఈ ఏడాది 'ఈగల్', 'మిస్టర్ బచ్చన్' సినిమాలతో ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఈ రెండు సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులకి కనెక్ట్ కాలేదు. అయిన కూడా రవితేజ స్పీడ్ మాత్రం తగ్గలేదు. ప్రస్తుతం మాస్ రాజా భాను భోగవరపు దర్శకత్వంలో మూవీ చేస్తున్నాడు. అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్ గా ఈ సినిమా తెరకెక్కుతోంది. రీసెంట్ గా రవితేజ షూటింగ్ లో గాయపడటంతో కొద్ది రోజులు చిత్రీకరణ వాయిదా పడింది. త్వరలో మరల షెడ్యూల్ స్టార్ట్ అయ్యే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ఈ సినిమాలో రవితేజకి జోడీగా శ్రీలీల నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్ లో ఇప్పటికే 'ధమాకా' మూవీ వచ్చి సూపర్ హిట్ అయ్యింది. ఇదిలా ఉంటే దీని తర్వాత మాస్ మహారాజ్ తమిళ్ దర్శకుడితో మూవీ చేసే అవకాశం ఉందనే ప్రచారం నడుస్తోంది. కోలీవుడ్ లో సుందర్ సి స్టార్ డైరెక్టర్ గా ఉన్నారు. అతని దర్శకత్వంలో తెరకెక్కిన 'అరణ్మనై' సిరీస్ కి తమిళనాట మంచి క్రేజ్ ఉంది. అతను దర్శకత్వంతో పాటు హీరో క్యారెక్టర్స్ కూడా చేస్తూ కోలీవుడ్ లో తనదైన స్టైల్ లో దూసుకుపోతున్నారు. ఇదిలా ఉంటే సుందర్ సి దగ్గర రవితేజకి సరిపోయే కథ ఒకటి ఉందంట. త్వరలో రవితేజకి అతను స్టోరీ నేరేషన్ ఇవ్వడానికి రెడీ అవుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్ లో మూవీ ఆల్ మోస్ట్ కన్ఫర్మ్ అయ్యే అవకాశం ఉందనే ప్రచారం నడుస్తోంది. టాలీవుడ్ బడా నిర్మాత ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందంట.

## బ్లాక్ అవుట్ ఫిట్‌లో సంయుక్త: గ్లామర్, గ్రేస్‌కి న్యూ డెఫినిషన్!

సౌత్ ఇండస్ట్రీలో తన ప్రత్యేకతను చాటుకుంటూ వరుస విజయాలతో దూసుకెళ్తున్న నటి సంయుక్త మీనన్, ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. బ్లాక్ స్టైలిష్ అవుట్‌ఫిట్‌లో, స్టన్నింగ్ లుక్‌తో ఆమె ఇచ్చిన ఫోజులు అభిమానుల మనసును దోచుకుంటున్నాయి. సమకాలీన ఫ్యాషన్‌కి సరికొత్త నిర్వచనం ఇస్తూ సంయుక్త ఈ సారి కూడా తన ప్రత్యేకతను మరోసారి నిరూపించింది. ఆమె ధరించిన బ్లాక్ టాప్, స్కర్ట్ లుక్ హుందాగా, క్లాసీగా కనిపిస్తుంది. ఈ ఫోటో షూట్‌లో ఫ్యాషన్ స్టైలిస్ట్ శ్రుతి మంజరి ఆధ్వర్యంలో ఈ లుక్ డిజైన్ చేయబడింది. ఆమె వేసిన డిజైనర్ అవుట్‌ఫిట్‌లో సంయుక్త మోడ్రన్ ఫ్యాషన్ ట్రెండ్‌ను ప్రతిబింబిస్తుంది. అంతేకాకుండా, ఫోటోగ్రాఫర్ ఇషాన్ నిఖిల్ గిరి ఈ ఫోటోలను తన ప్రత్యేకమైన టెక్నిక్‌తో అందంగా క్యాప్చర్ చేశారు. ఫోటోలో బ్లాక్ కలర్ మోడ్రన్ టాప్, స్టైలిష్ స్కర్ట్‌తో పాటు మెరిసే బ్రేస్లెట్, సింపుల్ బ్లాక్ బ్లేజర్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తూ కనిపిస్తుంది సంయుక్త. ఈ ఫోటోలు పోస్ట్ చేసిన వెంటనే నెటిజన్లు, అభిమానులు సంయుక్తకు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. సాంప్రదాయ లుక్‌లో మాత్రమే కాకుండా, మోడ్రన్ స్టైల్స్‌లో కూడా సంయుక్త చాలా స్టన్నింగ్‌గా కనిపిస్తుందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.




## యానిమల్ బ్యూటీని ఏడిపించారు..!



గ్లామర్ ఫీల్డ్ లో ఎవరికి ఎప్పుడు ఎలా కెరీర్ టర్న్ అవుతుంది అన్నది చెప్పడం కష్టం. మనం చేయాల్సింది చేసుకుంటూ పోతే రావాల్సిన ఫలితం వస్తుందని పెద్దలు చెప్పినట్టుగానే కష్టానికి తగిన ఫలితం కూడా వస్తుందని కొందరిని చూస్తే తెలుస్తుంది. బాలీవుడ్ లో హీరోయిన్ గా క్రేజ్ తెచ్చుకోవడం అనేది చాలా పెద్ద సవాల్. ఐతే యానిమల్ సినిమాతో త్రిప్తి డిమ్రి మాత్రం ఒక రేంజ్ లో పాపులారిటీ సంపాధించింది. అంతకుముందు అమ్మడు సినిమాలు, వెబ్ సీరీస్ లు చేసినా కూడా వర్క్ అవుట్ కాలేదు. కానీ యానిమల్ సినిమాతో అమ్మడు ఒక రేంజ్ క్రేజ్ తెచ్చుకుంది. ఐతే కెరీర్ లో సక్సెస్ కొట్టిన టైం లో తమ కెరీర్ ఎలా మొదలైంది. స్టార్టింగ్ డేస్ లో ఎలా స్ట్రగుల్ అయ్యామన్నది అలా ఒక్కసారి గుర్తుకొస్తుంది. యానిమల్ బ్యూటీ త్రిప్తి కూడా తన కెరీర్ తొలినాళ్ల పరిస్థితులను ఈమధ్య ఓ ఇంటర్వ్యూలో షేర్ చేసుకుంది. చదువు మీద ఆసక్తి లేక మోడలింగ్ మీద దృష్టి పెట్టా. ఐతే అది మా ఇంట్లో వాళ్లకు నచ్చలేదు అయినా వెనక్కి తగ్గలేదని చెప్పింది త్రిప్తి. అంతేకాదు సినిమా గురించి అసలేమాత్రం తెలియకపోయినా సినిమాల్లోకి వచ్చేశా. సినిమా గురించి ఎలాంటి అవగాహనా లేకుండానే వచ్చాయని అన్నారు. ఐతే తను చేసిన లైలా మజ్ను సినిమా కోసం చాలా కష్టపడ్డానని. సెట్ లో వాళ్లు చెప్పేది అర్థం కాక ఎన్నోసార్లు ఏడ్చిన సందర్భాలు ఉన్నాయని చెప్పుకొచ్చింది త్రిప్తి. కెరీర్ మొదట్లో దాదాపు అందరికీ ఇలాంటి అనుభవాలే ఉంటాయి. స్టార్ హీరోయిన్ అయిన ప్రతి ఒక్కరు ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే వారి కెరీర్ మొదలు పెట్టిన నాటి పరిస్థితులు వాళ్లను సర్ ప్రైజ్ చేస్తాయి. ఇక సినిమాల విషయానికి వస్తే త్రిప్తి ముచ్చటగా 3 సినిమాల్లో నటిస్తున్నారు. బాలీవుడ్ లో ఫుల్ ఫాం లో ఉన్న త్రిప్తికి టాలీవుడ్ నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తుంది. త్రిప్తి తెలుగు ఎంట్రీ ఇస్తే మాత్రం ఆమెకు స్టార్ క్రేజ్ ఇచ్చేందుకు ఆడియన్స్ రెడీగా ఉన్నారు. ఐతే ప్రస్తుతం అమ్మడు బాలీవుడ్ సినిమాలతోనే బిజీగా ఉంది. విజయ్ దేవరకొండ సినిమాలో త్రిప్తి హీరోయిన్ గా చేస్తుందని అన్నారు. కానీ దానికి సంబంధించిన ఎలాంటి అఫీషియల్ అప్డేట్ బయటకు రాలేదు.

## త్రిష రేర్ రికార్డ్! ఈ మ్యాటర్ తెలుసా?



సీనియర్ బ్యూటీ త్రిష.. ప్రస్తుతం ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా రాణిస్తున్న విషయం తెలిసిందే. ఒకానొక టైమ్ లో టాలీవుడ్ ను ఓ రేంజ్ లో ఏలిన ముద్దుగుమ్మ.. ఇక్కడి స్టార్ హీరోలందరి సరసన సినిమాల్లో నటించి మెప్పించారు. ఇండస్ట్రీలో హీరోయిన్ ఫ్రెండ్ క్యారెక్టర్స్ లో నటిస్తూ కెరీర్ స్టార్ట్ చేసిన త్రిష.. ఇప్పుడు స్టార్ హీరోయిన్ గా మారిపోయారు. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో యాక్ట్ చేశారు. మరెన్నో హిట్స్ అందుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ నటించి సత్తా చాటారు. అప్పట్లో మోహిని, నాయకి వంటి సినిమాలతో వరుస ఫ్లాపులు మాటుగట్టుకోగా.. త్రిష కెరీర్ క్లోజ్ అయిపోయిందని అంతా అనుకున్నారు. కానీ 96 సినిమాతో ఆమె కెరీర్ మలుపు తిరిగింది. అప్పటి నుంచి సరైన ప్రాజెక్టులు ఎంపిక చేసుకుని అదరగొడుతున్నారు. సెకండ్ ఇన్నింగ్స్ లో వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. బడా ప్రాజెక్టుల్లో నటిస్తూ సందడి చేస్తున్నారు. ఆచితూచి ప్రాజెక్టులు ఎంచుకుంటున్నారు. అదే సమయంలో మంచి హిట్స్ కూడా అందుకుంటున్నారు త్రిష. ఇటీవల పొన్నియన్ సెల్వన్, లియో సినిమాలతో సూపర్ హిట్స్ అందుకున్న త్రిష.. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ తో రెండు చిత్రాలు చేస్తున్నారు. విడా ముయార్చి, గుడ్ బ్యాడ్ అగ్లీలో యాక్ట్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో త్రిషకు సంబంధించిన ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. తమిళనాడులో రూ.200 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించిన కోలీవుడ్ మూవీస్ అన్నింటిలో త్రిష భాగమవ్వడం విశేషం. ఇదొక రికార్డు అనే చెప్పాలి. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన లియో మూవీ.. తమిళనాడులో దాదాపు రూ.230 కోట్లకు పైగా వసూలు చేసింది. అందులో త్రిష.. దళపతి విజయ్ కు జోడీగా నటించిన విషయం తెలిసిందే.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in